క్లుప్తంగా

ఎమ్మెల్యేకు అభినందనల వెల్లువ



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

జూలూరుపాడు: వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్‌నాయక్ రాష్ట్ర అసెంబ్లీ ఎస్టిమేట్స్ కమిటీ (అంచనాల కమిటీ) సభ్యుడిగా నియమితులు కావడంతో ఆయనకు అభినందనలు వెల్లువెత్తాయి. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యేను కొత్తగూడెం ఆయన నివాసంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాలు కప్పి సత్కరించారు. అదేవిధంగా భారతీయ గోర్ బంజారా పోరాట సమితి నాయకులు కలిసి అభినందించారు. కాంగ్రెస్ నాయకులు లకావత్ లచ్చు నాయక్, మాజీ ఎంపీపీ బానోత్ లాలు నాయక్, బానోత్ శాంతిలాల్, కిషన్, భూక్యా దేవీలాల్ నాయక్, గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్, రాంబాబు, బానోత్ శ్రీధర్, బాలు, శివ నాయక్, హరి ఉన్నారు.

గోవులను తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలి

పాల్వంచరూరల్: స్థానిక పట్టణంలోని నవ భారత్ ఏరియాలోని అన్నపూర్ణ గోశాల నుంచి బుధవారం పది గోవులను వాహనంలో బయటకు తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని పట్టణ ఎస్సై సుమన్‌కు బుధవారం వినతిపత్రం అందజేసినట్లు బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి భూక్య రవినాయక్ తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గంధం నాగేంద్రప్రసాద్‌గౌడ్, భట్టు శివనాయక్‌లు పాల్గొన్నారు.

నేడు క్రీడా పోటీలు

జూలూరుపాడు: స్థానిక జిల్లా ఉన్నత పాఠశాలలో రెండు రోజులు జరిగే మండల స్థాయి పాఠశాల క్రీడా పోటీలు గురువారం ప్రారంభం కానున్నట్టు పాఠశాలల క్రీడల కన్వీనర్ లక్ష్మీనర్సయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, అండర్ 17 బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు, ఈ క్రీడా పోటీల్లో పాల్గొనే బాలబాలికలు సకాలంలో హాజరుకావాలని పేర్కొన్నారు.

19, 20 తేదీలో టేకులపల్లిలో..

టేకులపల్లి: ఈ నెల 19, 20 తేదీల్లో మండల స్థాయిలో క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ ఠాకూర్ రాంసింగ్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల క్రీడల కన్వీనర్ పి.శేఖర్, మండల నోడల్ ఆఫీసర్ అజ్మీర జగన్, ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు రవి, రంగారావు, రాంచందర్‌సింగ్, బుగ్గ వెంకటేశ్వర్లు, మోతీలాల్, మంజీలాల్, మదన్, సీతాదేవి, నాగలక్ష్మి, శంకర్, మహేష్ పాల్గొన్నారు.

ఖర్గే రాజీనామా చేయాలి

టేకులపల్లి: ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటామని ప్రకటించిన మాలమహానాడుకు పరోక్షంగా మద్దతు ఇస్తున్న మల్లికార్జున ఖర్గే ఏఐసీసీ పదవికి రాజీనామా చేయాలని ఎమార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల జిల్లా కన్వీనర్ నల్లగట్ల వెంకన్న అన్నారు. ఈ మేరకు బుధవారం పాతతండాలోని హరిజన వాడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు కొండల రాము, శ్రీనివాస్‌రావు, శంకర్, వెంకటేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

లాభాలను ప్రకటించాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరం (2023–24)లో సాధించిన లాభాలను ప్రకటించి, అందులో కార్మికులకు 35 శాతం వాటాను చెల్లించాలని టీబీజీకెఎస్ చీఫ్ సెక్రటరీ కాపు కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని టీబీజీకెఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యాజమాన్యం ఆర్థిక సంవత్సరం ముగిసి, సుమారు ఆరు మాసాలు అవుతున్నప్పటికీ, నికర లాభాలను ప్రకటించకపోవటం శోచనీయమన్నారు. నాయకులు కూసన వీరభద్రయ్య, తుమ్మ శ్రీనివాస్, వసికర్ల కిరణ్, విజయకుమార్, మురళి, గడప రాజయ్య, తిరుపతి, ఆంజనేయులు, సూరజ్ ఉన్నారు.

ఓటరు జాబితా ప్రదర్శనకు సిద్ధం కావాలి

ఇల్లెందురూరల్: ఎన్నికల సంఘం ప్రకటించిన విధంగా ఈ నెల 13న ఫొటో ఓటరు జాబితా ప్రదర్శనకు కార్యదర్శులు సిద్ధం కావాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఓటరు జాబితా, వార్డుల విభజన, పంచాయతీ పాలనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపల్ ఓట్లు మండలంలో ఉన్నాయని ఆందోళన చెందకుండా విభజన చేయాలన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టినందున పంచాయతీ పాలనపై దృషిసారించాలని, ప్రతీ కార్యదర్శి విధిగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీవో చిరంజీవి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో శంకర్ పాల్గొన్నారు.

మళ్లీ మొదటికొచ్చింది..!

ఆట్ నంబర్ చెరువులో గణేష్ నిమజ్జన ఏర్పాట్లు అడ్డగింత

- అయోమయంలో భక్తమండలి
- పాలుపోని పరిస్థితిలో అధికారులు, ప్రజాప్రతినిధులు



నిమజ్జనానికి ఎంపిక చేసిన ఆట్ నంబర్ చెరువు

ఇల్లెందు: ఇల్లెందు 'ఆట్ నంబర్ చెరువు'లో గణేష్ నిమజ్జనం తగదంటూ అక్కడి ఆయకట్టు రైతులు, చేపల సొసైటీ సభ్యులు ముక్తకంఠంతో అడ్డుకున్నారు. బుధవారం నిమజ్జనం ఏర్పాట్లు చేసేందుకు సింగరేణి యంత్రాలు తరలివెళ్లి పనులు ప్రారంభించారు. సమాచారం అందుకున్న రైతులు హుటాహుటిన అక్కడికి చేరుకుని పనులు అడ్డుకున్నారు. సింగరేణి యంత్రాలు చెరువు వద్ద పనులు ప్రారంభించగా ఆయకట్టు, చేపల సొసైటీ సభ్యులు మూకుమ్మడిగా అడ్డుకున్నారు. దీంతో సింగరేణి యంత్రాలు వెనుతిరిగాయి. మున్సిపల్ చైర్మన్ డీవీ, వీసీ జానీపాషా, డీఎస్పీ చంద్రబాను, సీఐ బత్తుల సత్యనారాయణ, తహసీల్దార్ రవికుమార్, సింగరేణి జీఎం జాన్‌ఆనంద్, ఎస్ఓటూజీఎం బొల్లం వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు తదితరులు ఆ చెరువును సందర్శించి పరిశీలించారు.

ఇక గోదావరే దిక్కు..

గణేష్ నిమజ్జనం ఇక భద్రాచలం గోదావరే దిక్కు అవుతుందంటున్నారు. ఈ నెల 17న గణేష్ నిమజ్జనం నిర్వహించాలని భక్తమండలి నిర్ణయించింది. ఆట్ నెంబర్ చెరువులో అడ్డుకోవటంతో భక్తమండలి అయోమయంలో పాలుపోని పరిస్థితిలోకి చేరింది. అధికారులు, ప్రజాప్రతినిధులు మరో మార్గం వైపు పునరాలోచన చేయాల్సిన పరిస్థితికి నెట్టబడ్డారు. ఇదిలా ఉండగా ఈ విషయమై చైర్మన్ డీవీ దృష్టికి తీసుకెళ్లగా చెరువు శుభ్రం చేసినప్పటికీ సొసైటీ సభ్యులు అడ్డుకున్నారని, సత్యనారాయణపురం చెరువు అనుకూలంగా ఉన్నట్లు తెలిసిందని ఆ చెరువును కూడా సందర్శించి పరిశీలిస్తామని తెలిపారు. ఆ తర్వాత ఎటు తరలించాలనే అంశం మీద ఒక నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రైతులతో చర్చించేందుకు వెళ్లిన వారిలో డీవీతో పాటు కాంగ్రెస్ నేతలు మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, మెరుగు కార్తీక్ యాదవ్ తదితరులు ఉన్నారు.

సొసైటీ సభ్యులు, రైతుల ఆందోళన

గణేష్ నిమజ్జనానికి భద్రాచలం తరలి వెళ్లటం వల్ల అధికంగా భారం మీదపడుతుందని స్థానికంగా నిమజ్జనం చేయాలని నిర్ణయించారు. ఆట్ నంబర్ చెరువును ఎంపిక చేశారు. అయితే ఆట్ నంబర్ చెరువులో చేపల పెంపకం సాగుతోంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఏర్పాటైన సొసైటీ ఆధ్వర్యంలో చెరువు సాగుతోంది. అంతేగాక ఓ లిఫ్ట్ సాయంతో చెరువు కింద వరి సాగు చేస్తున్నారు. విగ్రహాల వల్ల వచ్చే రసాయనాలతో చేపలు మృతి చెందుతాయని సొసైటీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక ఇల్లెందు పట్టణం, మండలంలోని విగ్రహాలను కారేపల్లి పరిధిలో



ఏర్పాట్లను అడ్డుకుంటున్న సొసైటీ సభ్యులు

గల చెరువులో ఎలా నిమజ్జనం చేస్తారంటూ రైతులు వ్యతిరేకించారు. దీంతో సింగరేణి నుంచి చెరువు శుభ్రం చేసేందుకు వెళ్లిన యంత్రాలు వెనుతిరిగి వచ్చాయని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు వెల్లడించారు. దీంతో గణేష్ నిమజ్జనం కథ మళ్లీ మొదటికి వచ్చింది.

సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి



సుజాతనగర్: నివాళులర్పిస్తున్న నాయకులు

సుజాతనగర్: సాయుధ పోరాట స్ఫూర్తితో నయా దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. తెలంగాణ విలీన దినోత్సవాన్ని పురస్కరించుకొని నాయకుల గూడెంలో తెలంగాణ సాయుధ పోరాట యోధులు రావి నారాయణరెడ్డి స్థూపం వద్ద వారోత్సవాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి అమరవీరులకు నివాళులర్పించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు భూక్య దస్రు, కంచర్ల జమలయ్య, కోమారి హన్మంతరావు, జక్కుల రాములు, తాళ్లూరి పాపారావు, ధర్మరావు తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ మేరకు మండలకేంద్రంలో ఏర్పాటు కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గుగులోత్ రాంచందర్ నాయక్ జెండా ఆవిష్కరించారు. ఈనెల 21న హైదరాబాదులో జరిగే విలీన దినోత్సవ సభకు పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు. మండల సహాయ కార్యదర్శులు ఎజ్జు భాస్కర్, గుగులోత్ శ్రీను, శ్రీ రాములు, తేజావత్ మధు, లక్ష్మణ్, సతీష్, కృష్ణ పాల్గొన్నారు.

పాల్వంచ: తెలంగాణా సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం పిలుపునిచ్చారు. స్థానిక ఈ సేవ సెంటర్ వద్ద సాయుధ పోరాట యోధులు ఉషారావు, రామకోటయ్యల స్తూపం వద్ద తెలంగాణ సాయుధ పోరాట రైతాంగ పోరాట వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అమర వీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ, మండల కార్యదర్శులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచందర్ రావు, నాగేశ్వరరావు, రాహుల్, సుధాకర్, పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావ్, శ్రీనివాస రావు, చెన్నయ్య, విజయ్, శేఖర్, వైఎస్ గిరి, లాల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



జీఎం సుధాకర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) సామ్యేల్ సుధాకర్‌ను బుధవారం కార్పొరేట్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో గాంధీపథం కన్వీనర్ చింతల చెరువు గోర్తెం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో 1969 ఉద్యమ రాష్ట్ర నాయకులు వి.శాంత రామ్, చంద్రమౌళి,ఎస్సీ నాయకులు అరుణ, రాము, శాంతకుమారి, రాజేశ్వర రావు, కుటుంబరావు, జ్ఞాన వినోదిని ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం..

కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులను లయన్స్‌క్లబ్ ఆఫ్ మిలీనియం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం డాక్టర్ ప్రభుదయాల్, లయన్స్ క్లబ్ సంఘం అధ్యక్షులు సక్రు, కార్యదర్శి బాలు, సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్ కార్మికులకు న్యాయం చేస్తాం

ఇల్లెందు: సింగరేణి సోలార్ కార్మికులకు న్యాయం చేస్తామని డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు స్పష్టం చేశారు. బుధవారం ఇల్లెందు సోలార్‌ప్లాంట్ కార్మికులు, యూనియన్ ప్రతినిధులతో చర్చించారు. సింగరేణి యాజమాన్యంతో పలు దఫాలు చర్చించినప్పటికీ డీజీఎం పర్సనల్ జీవీ మోహన్ రావు వారికి ప్రాధాన్యత కల్పిస్తామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు. యూనియన్‌ల ప్రతినిధులు యాకుబ్‌షావలీ, కృష్ణ, మాజీ జెడ్పీటీసీ జగన్, మాజీ సర్పంచ్ బన్సీలాల్, గుగులోత్ సక్రూ, తేజ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను ఆదుకోవాలి

ఇల్లెందు: భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షురాలు జి. అనురాధ డిమాండ్ చేశారు. బుధవారం ఇల్లెందులోని ఇఫ్టూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను ప్రైవేటు శక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నాయన్నారు. భవన నిర్మాణ రంగం కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 23న చలో హైదరాబాద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జే.సీతారామయ్య, ఎండీ రాసుద్దీన్, కొండపల్లి శ్రీనివాస్, నాగేశ్వరరావు, సురేష్, ఉపేందర్, బాలమల్లు, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన ఇళ్లకు పరిహారం మంజూరు

ఇల్లెందురూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నేలమట్టమైన ఇళ్లకు ప్రభుత్వం నుంచి పరిహారం మంజూరైందని తహసీల్దార్ రవికుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ.. మండల, పట్టణ పరిధిలో వర్షాలకు ఇళ్లు కూలినట్లు ఏడుగురి నుంచి దరఖాస్తులు అందగా సర్వే నిర్వహించి నివేదిక అందజేశామన్నారు. ఒక్కో ఇంటికి రూ.16,500 చొప్పున నిధులు మంజూరయ్యాయన్నారు.

ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధిస్తాం

టేకులపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయ వృత్తి విధానంలో ఏకీకృత సర్వీస్ రూల్స్ లేకపోవడంతో హక్కులు సాధించుకోలేకపోతున్నామని, త్వరలో సర్వీస్ రూల్స్ సాధిస్తామని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవి అన్నారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లి మండలంలో పలు స్కూళ్లలో సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధిస్తామని, మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు ద్వారా జీతాలు ఇప్పిస్తామని, కేజీబీవీ టీచర్ల కు టైం స్కేల్ ఇచ్చే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు టి.రవీందర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు నర్సయ్య, మండలాధ్యక్షుడు జి. మోతిలాల్, రమేష్ బాబు, ప్రసాద్ రాజేష్ ఖన్నా పాల్గొన్నారు.

కార్మికుడికి ఎమ్మెల్యే నివాళి

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ సోంద్ సీతయ్య అనారోగ్యంతో బుధవారం మృతి చెందగా ఎమ్మెల్యే కోరం కనకయ్య సీతయ్య మృతదేహన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీవో చిరంజీవి, కార్యదర్శి రజనీకాంత్, కాంగ్రెస్ నాయకులు వరద రాంచంద్రయ్య, ఆళ్ల నాగేశ్వరరావు, ఆముదాల ప్రసాద్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన

సుజాతనగర్: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ లైట్లు వెలగకపోవడంపై నిరసన వ్యక్తం చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి వీర్ల రమేష్, నర్రా శివరామకృష్ణ, శ్రీను, మురళి, గండమాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం



గంగారంలో సామూహిక అక్షరాభ్యాసం

టేకులపల్లి: అంగన్‌వాడీల్లో తల్లీ బిడ్డలకు పోషకాహారం లభిస్తుందని తద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీవో కేఎం.తార అన్నారు. ఈ మేరకు బుధవారం సూపర్‌వైజర్ యశోదమ్మ ఆధ్వర్యంలో బొమ్మనపల్లి, మద్రాస్‌తండాలలో, గంగారం సెక్టార్ సూపర్‌వైజర్ లక్ష్మీ ఆధ్వర్యంలో గంగారంలో, టేకులపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ అనురాధ ఆధ్వర్యంలో గోలియాతండా జీపీ వాగొడ్డుతండాలో, సులానగర్ సెక్టార్ సూపర్‌వైజర్ నిర్మల ఆధ్వర్యంలో ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డులో, బోడు సెక్టార్ సూపర్‌వైజర్ ఖలీదాబేగం ఆధ్వర్యంలో బోడులో పోషణ్ అభియాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం జ్యోతి రాణి, ఎం.పద్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): దళితుల మధ్య చిచ్చుపెట్టే ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు పునరాలోచన చేయాలని, క్రిమిలేయర్ ముసుగులో రిజర్వేషన్ల ఎత్తివేతకు కుట్ర జరుగుతుందని ఎస్సీ వర్గీకరణ జిల్లా జేఏసీ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ సబ్బారపు మధుసూదన్ అన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్ల ఎదుట నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ రమాదేవికి వినతిపత్రాన్ని అందజేశారు. కమిటీ గౌరవ సలహాదారులు గిద్ద పరంజ్యోతిరావు, దాసరి నాగేశ్వరరావు, వాసుమల్ల సుందర్ రావు, తోటమల్ల రమణమూర్తి, కో కన్వీనర్లు ఏడెల్లి గణపతి, కూరపాటి రవీందర్, దారా చిరంజీవి, తుంపిరి శివ, దాసరి శేఖర్, నాయకులు రామారావు, శ్రీను, జిల్లా మహిళా కో కన్వీనర్లు మేరుగు అనసూర్య, నక్క సృజన, లత, రోహిణీదేవి, దారా లక్ష్మి, కోశాధికారి సబ్బారపు నాగేంద్ర పాల్గొన్నారు.

అగ్రి లీగల్ క్లినిక్ సేవలు విస్తృతపర్చాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ లాల్‌చంద్

ఇల్లెందురూరల్: అగ్రి లీగల్ క్లినిక్ సేవలను మరింత విస్తృతం చేయాలని వ్యవసాయ సహాయ సంచాలకులు లాల్‌చంద్ సూచించారు. మండలంలోని సుదిమళ్ల రైతువేదికలో అగ్రి లీగల్ క్లినిక్‌ను బుధవారం ఆయన సందర్శించారు. క్లినిక్‌లో రైతులు పొందుతున్న సేవలను పరిశీలించారు. నిర్దేశించిన తేదీల్లో క్లినిక్ నిర్వహణ, రైతుల హాజరు వంటి వివరాలను తనిఖీ చేశారు. న్యాయపరంగా రైతులకు ఎదురయ్యే సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలన్నారు. అవసరమైతే వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు కూడా తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ వలంటీర్ సతీష్ ఖండేల్‌వాల్, ఏఈఓ సుమన్, రైతు వేదిక సిబ్బంది పాల్గొన్నారు.

అమరుల త్యాగం మహోన్నతమైంది



మొక్క నాటుతున్న అధికారులు

ఇల్లెందు: విధి నిర్వహణలో కర్తవ్య దీక్షకు అశువులుబాసిన అమరుల త్యాగం మహోన్నతమైందని ఇల్లెందు ఎఫ్‌డీఓ కర్నావత్ వెంకన్న, ఇల్లెందు, కొమురారం రేంజర్లు ప్రసాద్, ఉదయ్‌లు అన్నారు. బుధవారం ఎఫ్‌డీఓ కార్యాలయం ఆవరణలో 'అటవీశాఖ అమరవీరుల దినోత్సవం' సందర్భంగా అమరవీరల స్మారక స్తూపం వద్ద నివాళులర్పించారు. విధి నిర్వహణలో విచ్ఛిన్నకరశక్తుల దాడులకు అటవీశాఖ ఉద్యోగులు బలి కావటం అత్యంత విషాదకరమైన అంశమన్నారు. అటవీశాఖలో పని చేసే అమర త్యాగాలను స్మరించుకుంటూ కర్తవ్య దీక్షను కొనసాగిద్దామని తెలిపారు. స్వరాష్ట్రంలో ప్రభుత్వానికి అనేక లక్ష్యాలు ఉన్నాయని, వాటని నెరవేర్చటంలో మనందరం కలిసికట్టుగా కృషి చేద్దామంటూ అటవీశాఖ సిబ్బంది పని తీరును కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ వీరబాబు, ఫారెస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి బి.కోటేశ్వర రావు, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, డివిజన్ పరిధిలోని సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి



మాట్లాడుతున్న సతీష్ కుమార్

పాల్వంచ: అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చేరిన ప్రతీ విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోద్ చేసి యుడైస్ ప్లస్ పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ సతీష్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని బొల్లేరుగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యు డైస్‌పై శిక్షణ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతేడాది కంటే ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం విద్యాశాఖ యుడైస్ ప్లస్‌ను ప్రవేశపెట్టి దేశంలో విద్యార్థులందరికీ ఒక యూనిక్ కోడ్, పిన్ నంబర్‌ను కేటాయించడం జరిగిందన్నారు. అదేవిధంగా పాఠశాలకు సంబంధించి మౌలిక వసతులు, ఉపాధ్యాయుల వివరాలు, తరగతి గదులు, విద్యార్థులకు వసతులు, సమగ్ర వివరాలు యుడైస్ ప్లస్ పోర్టల్‌లో నమోద్ చేయాలన్నారు. డీసీఈబీ చైర్మన్ మాధవరావు, ఎంఎస్‌వో ప్రకాష్, ఆర్‌పీ రాజశేఖర్, హెచ్ఎంలు ఉన్నారు.

వరద బాధితులకు సాయం



పాల్వంచరూరల్: ఉల్వనూరులో వరద బాధితులకు సరుకులు పంపిణీ చేస్తున్న డాక్టర్లు



పాల్వంచ: జెండా ఊపి వాహనాలను తరలిస్తున్న లింగం వెంకట శరత్‌బాబు

పాల్వంచ: ఖమ్మం వరద బాధితులకు పాల్వంచ నవ లిమిటెడ్ సంస్థ సహకారం అందించింది. ఈ మేరకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం వరద బాధితులకు వంట సామగ్రి, దుప్పట్లను వాహనాల్లో తరలించారు. ఈ వాహనాలకు సంస్థ వైస్ ప్రెసిడెంట్ లింగం వెంకట శరత్ బాబు జెండా ఊపి ప్రారంభించారు. జనరల్ మేనేజర్ ఎంజీఎం ప్రసాద్, వైవి.శ్రీనివాస్, ఎన్.సురేష్ చంద్ర, ఎం.రత్నకిషోర్, బి.రామారావు, ఆర్‌పి.కిరణ్, డిప్యూటీ మేనేజర్ ఎం.శంకయ్య, శ్రీకాంత్, ఎన్.ప్రసాద్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎన్.సత్యనారాయణ, చీఫ్ లైజన్ ఆఫీసర్ వి.ఖాదరేంద్రాబాబు, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు..

పాల్వంచరూరల్: ఖమ్మం వరద బాధిత కుటుంబాలకు డాక్టర్లు నిత్యవసర సరుకులను పంపిణీచేశారు. మండల పరిధి ఉల్వనూరులోని లొద్దిగండి వాగు పొంగిపొర్లడంతో వరద ముంపునకు గురై సర్వం కోల్పోయిన 60 కుటుంబాలకు బుధవారం పాల్వంచ పట్టణానికి చెందిన డాక్టర్ బాలయ్య, వసుంధరాదేవి, డాక్టర్ కోరాశ్రీ,, డాక్టర్ కమల, లయన్స్‌క్లబ్ ఆఫ్ పాల్వంచ అధ్యక్షులు కోర్ర వీరభద్రరావు, సెక్రటరీ భాను మూర్తి, పాత్రికేయులు సందీప్, నజీర్, మహేష్ వేర్వేరుగా పదికేజీల బియ్యం, సరుకులు, దుప్పట్లు, దుస్తులు పంపిణీచేశారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సర్కిల్ కార్యాలయం ఎదుట డిమాండ్లతో కూడిన పోస్టర్లను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ప్రమోషన్లలో రిజర్వేషన్లను పునరుద్ధరించాలని, మెరిట్ కమ్ సీనియారిటీ విధానాన్ని రద్దు చేయాలని, ఆర్టిజన్లకు ఏపీఎస్ఈబీ నిబంధనలను వర్తింపజేయాలన్నారు. అనంతరం సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ ఎస్ఈ మహేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రీజనల్ అధ్యక్షకార్యదర్శులు ప్రతాప్, ఉదయ్ రత్నకుమార్, డివిజన్ అధ్యక్షుడు బండి రాంబాబు, నాయకులు వి ధర్మరాజు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా లోలెవల్ చప్టాలు



సోములగూడెం రోడ్డులో బూడిద వాగుపై లో లెవల్ చప్టా



కిన్నెరసాని వాగు గేట్లు ఎత్తడంతో కొత్తపేట వద్ద వరద ప్రవాహం

- రాకపోకలకు ఇబ్బందిగా మారిన కాజ్‌వేలు
- శాశ్వత పరిష్కారం కలేనా?

పాల్వంచరూరల్: వానాకాలం వస్తే లోలెవల్ కాజ్‌వేలతో ప్రజల రాకపోకలు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతమైన పాల్వంచ మండలంలో చాలా రహదార్లు వివిధ గ్రామాలను కలిపేందుకు వాగులపై కాజ్‌వేలను నిర్మించారు. ప్రతీ ఏడాది వరదల కారణంగా ఆయా గ్రామాలకు తిప్పలు తప్పడం లేదు. మండలంలోని బిక్కుతండా వద్ద బూడిద వాగుపై 30 ఏళ్ల క్రితం లోలెవల్ చప్టాను నిర్మించారు. వర్షాలు కురిసి నప్పుడు బూడిద వాగు పొంగుతుంది. దీంతో పాల్వంచ నుంచి సోములగూడెం, కమ్మరిగూడెం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. మల్లారం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై లోలెవల్ చప్టా ఉంది. బంజర చెరువు అలుగుపోస్తే రాకపోకలు నిలిచిపోతాయి. ఎంత అత్యవసరమైనా వరద తగ్గేవరకు పరిష్కార మార్గం లేదు. అదేవిధంగా తవిశలగూడెం గ్రామపంచాయతీలోని కొత్తపేట కిన్నెరసాని వాగు ఒడ్డును అనుకుని ఉంది. వానాకాలంలో గేట్లు ఎత్తినప్పుడల్లా గంగమ్మతల్లి ఆలయం నుంచి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై వరద పోటెత్తుతుంది. ఆయా చప్టాలపై హైలెవల్ బ్రిడ్జిలు నిర్మించాలని బాధిత గ్రామాల ప్రజలు ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు...



మల్లారం గ్రామానికి ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. దీనికి తోడు లోలెవల్ చప్టాపై వరద ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. శాశ్వతంగా పరిష్కారానికి పలుమార్లు ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– ఈసం శ్రీనివాస్, మాజీ సర్పంచ్, మల్లారం

ప్రతిపాదనలు పంపాం..



మండలంలో బూడిదవాగు, మల్లారం గ్రామాల పరిధిలో ఉన్న లోలెవల్ చప్టాలను హైలేవల్ చప్టాల నిర్మాణం కోసం, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణ కోసం రూ.2 కోట్ల అంచనాల వ్యయంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.

– శ్రీనివాసరావు, పంచాయతీరాజ్‌శాఖ ఈఈ